క్లుప్తంగా

మల్లన్న సేవలో..



స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వస్తున్న దేవదాయశాఖ కమిషనర్

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక,వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదం అందజేశారు.

శ్రీశైలంటెంపుల్: కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జమ్ములమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కర్నూలు మేయర్ బీవై.రామయ్య ఉన్నారు. వేర్వేరు సమయాల్లో వచ్చిన వీరికి దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.



స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వచ్చిన ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

మున్సిపాలిటీ నూతన భవనానికి నిధుల మంజూరు



మాట్లాడుతున్న దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: మున్సిపాలిటీ కార్యాలయ నూతన భవన నిర్మాణం కోసం జగనన్న ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పగిడ్యాల రోడ్డులోని బ్రహ్మంగారి మఠం సమీపంలో మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణం పనులకు త్వరలో టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.2.34 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మల్లికార్జునరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక సాయిబాబానగర్‌లోని సీపీఐ స్వామిరెడ్డి భవన్‌లో నంద్యాల జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని, ఎనర్జీ సెక్రటరీలను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డులను మంజూరు చేసి ఈపీఎఫ్ కాకుండా జీపీఎస్ అమలు చేయాలన్నారు. సమస్యల సాధన కోసం వివిధ కార్యక్రమాలు చేపనున్నట్లు చెప్పారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

రోటరీ సభ్యులకు సత్కార్ అవార్డులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల రోటరీ క్లబ్ సభ్యులు సత్కార్ అవార్డులను అందుకున్నారని రోటరీ అధ్యక్షుడు దండె దస్తగిరి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి విశేష కృషి చేసిన పీడీజేలు రామలింగారెడ్డి, శ్రీరామమూర్తి, చిన్నపురెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డికి అవార్డులను లభించినట్లు చెప్పారు.

ఉల్లాసంగా కార్తీక వన భోజనాలు

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రథమనందీశ్వర స్వామి ఆలయ ఆవరణంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం అఖిల భారత రజక సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. అలాగే రజక వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశారు. అనంతరం మ్యూజికల్ చైర్, కబడ్డీ, తాడాట తదితర పోటీలతో పాటు పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు సన్మానం, మెమొంటోలను అందజేశారు. సంఘం నాయకులు సుబ్బారావు, జిల్లెల్లె శ్రీరాములు, రోశన్న, రామమద్దిలేటి పాల్గొన్నారు. అలాగే.. స్థానిక భీమలింగేశ్వర స్వామి దేవస్థానంలో వీరశైవ సేవా సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడు నాగరాజు, వీరశైవులు శివప్ప, మల్లప్ప పాల్గొన్నారు.



దశవిధ హారతులను ఇస్తున్న అర్చకులు



నదీహారతి ఇస్తున్న అర్చకులు



కృష్ణమ్మకు సారెను సమర్పిస్తున్న అర్చకులు

దీపం.. సర్వ శుభం

శ్రీశైలం టెంపుల్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో ఆదివారం భక్తులు జ్వాలా తోరణం, లక్షదీపోత్సవం పూజల్లో పాల్గొన్నారు. అంతకు ముందు పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి భ్రమరాంబమల్లికార్జున స్వామి వార్లను దర్శించుకొని క్షేత్ర ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా పూజల్లో పాల్గొనేందుకు వచ్చిన భక్తులతో శివనామస్మరణతో నల్లమల గిరులు మారుమోగాయి.



పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం



జ్వాలాతోరణోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజ, ఎమ్మెల్యే శిల్పా తదితరులు



శ్రీశైలంలో భక్తజన సంద్రం నడుమ జ్వాలా తోరణం వెలిగించిన దృశ్యం



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో కార్తీకపౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు: నల్లమల అడవిలోని రుద్రకోడూరు క్షేత్రంలో వెలసిన శ్రీరుద్రాణి సమేత శ్రీరుద్ర కోటేశ్వర స్వామి వారికి కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. క్షేత్రంలో వేకువజామున 4 గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేషపూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. మధ్యాహ్నం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్లి కోనేరుల్లో పుణ్యస్నానాలాచరించి స్వామి, అమ్మవారిని దర్శించుకొని పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం క్షేత్రంలో లక్ష దీపోత్సవం జరిగింది. ఈ ఏడాది ఆర్టీసీ అధికారులు రుద్రకోడూరు క్షేత్రానికి బస్సు సర్వీసులు నడపకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. చివరగా చీకటిపడిన అనంతరం క్షేత్ర సన్నిధిలో జ్యోతిదర్శనం చేసుకున్నారు. అలాగే.. పట్టణంలోని శివాలయాల్లో కార్తీకపౌర్ణమి సందర్భంగా భక్తులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

కొత్తపల్లి: పవిత్రపుణ్య క్షేత్రమైన సప్తనదీ సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయంలో ఆదివారం కార్తీక శోభ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సప్తనదీ సంగమ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించి కృష్ణమ్మకు హారతులు పట్టారు. కార్తీక దీపాలను కృష్ణమ్మ అలలపై వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ వేదమంత్రాలను పఠిస్తుండగా గర్భాలయంలో అడుగునీటిలో ఉన్న వేపదారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు.



మహాశివు నికి పూజలు నిర్వహించిన భక్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో ఆదివారం సహస్ర దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవీరభద్రస్వామి ఆలయ ఆవరణలో స్వామి వారి సేవాసమితి సభ్యుల అధ్వర్యంలో భక్తులు పలురకాల పూలతో శివలింగాకృతిని రూపొందించి దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయంలో శ్రీవీరభద్ర, ఈశ్వర, చెన్నకేశవ, ఆంజనేయస్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు. సమీపంలోని కేసీ కాల్వలో మహిళలు కార్తీక దీపాలను వదిలి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణోత్సవం

మిద్తూరు : మండలంలోని సుంకేసుల గ్రామంలో శ్రీ వీరభద్రస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీ దత్తాశ్రమ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పురోహితులు బాలకాష్ణశర్మ కల్యాణ తంతను వేదయుక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేడుకను తిలకించారు.



మహానందిలో పూజలకు హాజరైన భక్తులు

మహానంది: కార్తీకపౌర్ణమి సందర్భంగా మహానంది క్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేలాది మంది భక్తజనం రాకతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. నంద్యాల రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



ఆత్మకూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తాటిపాడులో లింగాకృతిలో సహస్రదీపాలను వెలిగిస్తున్న భక్తులు,



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

మందుల పంపిణీ

కొత్తపల్లి: మండల పరిధిలోని గోకవరం గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు సేవా భారతి ప్రతినిధి రఘురామయ్య తెలిపారు.ఆదివారం గ్రామంలోని గుణంపల్లి నారాయణమ్మ వైద్యశాలలో కర్నూలుకు చెందిన అశ్విని హాస్పటల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే 40 మందికి పౌష్టికాహారం అందజేశామని చెప్పారు. ప్రతినిధులు జైపాల్‌రెడ్డి,ప్రభాకర్‌రెడ్డి,రఘురాములు,వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేకూర్చాలి

నందికొట్కూరు : బీసీలకు రాజ్యాంగ పదవుల్లో న్యాయం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కురుమూర్తి కోరారు. ఆదివారం పట్టణంలోని బీసీ భవన్‌లో సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించి జనాభా ప్రాతిపాదికన సీట్లు కేటాయించాలన్నాడు. పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు గోకారి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు

మహానంది: బంధువులను పరామర్శించి బైకుపై వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం తమడపల్లె మలుపుల వద్ద చోటు చేసుకుంది. కోవెలకుంట్లకు చెందిన రాముడు తమడపల్లె గ్రామంలోని బంధువులను పలకరించి నంద్యాల వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో రాముడికి తీవ్రగాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో లష్కర్ మృతి

పగిడ్యాల: కోడుమూరు సబ్ డివిజన్‌లో ఎల్‌ఎల్‌సీ కాలువకు ఔట్‌సోర్సింగ్ లష్కర్‌గా పనిచేస్తూ డైవర్షన్‌లో కర్నూలు సీఈ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన పెద్దరాముడు గుండెపోటుకు గురై ఆదివారం మృతి చెందారు. పగిడ్యాల మండలం పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన మృతుడు శ్రీశైలం నీటిముంపు నిర్వాసితుడు. తెల్లవారుజామున హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం సీఈ కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్ రూ. 5 వేలు అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగన్న కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హిందూధర్మాన్ని పాటించాలి

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పాటించాలని హిందూ జ్ఞానవేదిక ఆత్మకూరు కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు తెలిపారు. ఆదివారం మండలంలోని రామసముద్రం గ్రామంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. మునిదాసు, కుమారాచారి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బస్సుల్లేక భక్తుల అవస్థలు



శ్రీశైలం బస్సు కోసం ఆత్మకూరు బస్టాండ్‌లో రాత్రి అయినా వేచి చూస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలానికి సరైన బస్సులు లేకపోవడంతో ఆదివారం భక్తులు ఇబ్బందులు పడ్డారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆత్మకూరు , కొత్తపల్లి , వెలుగోడు, పాములపాడు మండలానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీశైలం వెళ్లేందుకు ఆత్మకూరు బస్టాండ్‌కు చేరుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ డిపో అధికారులు కావాల్సినన్ని సర్వీసులు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. 54 బస్సుల్లో 34కి పైగా హయర్‌బస్సులే ఉండడం, మిగిలిన 20 సర్వీసులు పల్లె వెలుగులు కావడం, అవి ఘాట్ రోడ్డులో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి కార్తీకమాస , మహాశివరాత్రి పర్వదినాల్లో అత్యధికంగా ఆత్మకూరు డిపో నుంచే బస్సు సర్వీసులు నడిచేవి. అయితే ఉన్నతాధికారులు కలెక్షన్లు పేరుతో ఉన్న సర్వీసులను తొలగించడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల శ్రీశైలం, బెంగళూరు సూపర్‌లగ్జరీ బస్సుల స్థానంలో నాన్ ఏసీ హయర్ బస్సులు రావడంతో వాటిని తొలగించి వాటిని ఆత్మకూరు డిపోలో ఉంచకుండా హిందూపూర్‌కు పంపాలని ఆదేశించారుది. అయితే ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆ బస్సులను హిందూపూర్‌కు పంపొద్దని, వాటిని యథావిధిగా బెంగళూరు, లేదా హైదరాబాద్, విజయవాడకు నడపాలని కోరారు. ప్రస్తుతం శ్రీశైలక్షేత్రానికి రావాలంటే కేవలం కర్నూలు డిపోకు చెందిన బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. గత్యంతరం లేని స్థితిలో భక్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే ఒక్కొక్కరికి రూ.400 చొప్పున డ్రైవర్లు చార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా.. ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే.. ఈ ఏడాది రుద్రకోడు, కొలనుభారతి, సంగమేశ్వరం వెళ్లే బస్సులను కూడా రద్దు చేయడంతో భక్తులకు ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయి.

బుడ్డా.. నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న లక్ష్మీనరసమ్మ

మహానంది: ఆత్మకూరులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు లభించిన విశేష ఆదరణ చూసి ఓర్వలేని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మతి భ్రమించి వ్యాఖ్యలు చేయడం దారుణమని, నోరు అదుపులో పెట్టకొని మాట్లాడాలని మహానంది మండల వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీ నరసమ్మ మండిపడ్డారు. ఆదివారం బుక్కాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యున్నత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలను బినామీలని మాట్లాడటం నీ దురహంకారానికి నిదర్శనమన్నారు. గతంలో నువ్వు వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు బుక్కాపురం నుంచి సర్పంచ్‌గా నిలబడితే తన తరపున ప్రచారం చేయలేదని, స్వల్ప మెజార్టీతో ఓడిపోతే కనీసం ఫోన్ చేసి ధైర్యం చెప్పలేదని, ఐదేళ్ల పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనను ఏకగ్రీవంగా ఎంపీటీసీగా గెలిపించి మండల ఉపాధ్యక్షురాలిని చేశారన్నారు. నోటి దురుసు తగ్గించుకోకపోతే మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు.

జనమే జగనన్న బలం



మిట్టకందాలలో వైఎస్సార్‌సీపీ జెండావిష్కరణ చేస్తున్న నాయకులు



మద్దూరులో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పాములపాడు: సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలం ప్రజలేనని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో సర్పంచు చింతల నారాయణ, మద్దూరు గ్రామంలో సర్పంచు అఖ్తరున్నిసా జబ్బార్ ఆధ్వర్యంలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ జెండాను ఎగురవేశారు. గ్రామంలో పర్యటించి ప్రజల ఆమోదంతో ఇళ్లపై జెండాలను ఏర్పాటు చేశారు. మద్దూరులో జనం పెద్ద సంఖ్యలో పాల్గొనగా, అలాగే మజరా అయిన క్రిష్ణానగర్ గ్రామంలో కూడా పర్యటించారు.అంతకు ముందు మండల కేంద్రంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెలిమిల్ల ఎంపీటీసీ సురేష్, సొసైటీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, ఉప సర్పంచు నరసింహుడు, డైరెక్టర్ గోపాల్, మాజీ ఎంపీటీసీ చౌడయ్య, మాజీసర్పంచులు బాలునాయక్, లక్ష్మిదేవి,రాముడు, నాయకులు యుగంధర్‌రెడ్డి, మహానందిరెడ్డి, బంగారం మౌలాలి, అంబయ్య, శ్రీనివాసులుగౌడు, ఉశేన్, శేఖర్, దరగయ్య, నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ఆత్మకూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నందికొట్కూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



వెలుగోడులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: భారతరాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచ దేశాల్లోనే అత్యంత పెద్దదని గుర్తు చేశారు.రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ అన్ని వర్గాలకు సంపూర్ణ న్యాయం చేశారని, ఆయన సేవలను కొనియాడారు. పార్టీ కార్యాలయం నుంచి కొత్తబస్టాండ్, గౌడ్‌సెంటర్ మీదుగా పాతబస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముసుపు పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బాలస్వామియాదవ్, వెంకటస్వామి గౌడ్, మురళీ, దరగమ్మ పాల్గొన్నారు. అలాగే.. పాతబస్టాండ్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రాబిన్‌సన్ మాదిగ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు దరగయ్య మాదిగ, బుజ్జి మాదిగ, రమణ పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలో 74వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని దళిత సంఘాల, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ ఇండియా మిషన్ మండలాధ్యక్షుడు పరుశురాముడు,మాల మహానాడు సీనియర్ నాయకుడు మల్లయ్య,కేవీపీఎస్ నాయకులు సంపత్‌కుమార్,వైఎస్సార్‌సీపీ నాయకులు దుబ్బన్న,కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే.. జెడ్ వారిపల్లె గ్రామంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు రాజు, మండల నాయకులు స్వామన్న,మద్దిలేటి నివాళులర్పించారు.

పగిడ్యాల: బీఆర్ అంబేడ్కర్ పూజ్యనీయుడని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లలర్పించి మాట్లాడారు. ఎంపీడీఓ వెంకటరమణ, సూపరింటెండెంట్ నాగరాజరావు, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : మండలంలోని నాగటూరు గ్రామంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యూత్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కొణిదేల ఎంపీటీసీ చందమాల సురేష్, అయ్యన్న పాల్గొన్నారు.

నందికొట్కూరు: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శమని ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ రాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కౌన్సిలర్లు ధర్మారెడ్డి, జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు చిట్టిరెడ్డి, బాలస్వామి, డాక్టర్లు వనజ, రాజు, శివానందరెడ్డి, మాలమహానాడు నాయకులు శివప్రసాద్, నాగన్న పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రాజెక్ట్ కాలనీలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వి.లక్ష్మయ్య , పి వెంకటేశ్వర్లు, జి.ప్రకాష్, రాజేంద్రప్రసాద్ ఆదివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆటో మొబైల్స్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి వై. ఆశీర్వాదం , ఎ .బెనహర్, పి.మల్లికార్జున తదితరులు నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బుచ్చయ్య విద్యార్థులకు రాజ్యాంగం ప్రత్యేకతలను వివరించారు.

పాములపాడు: మండలంలో ఆదివారం భారత రాజ్యంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తుమ్మలూరు గ్రామంలో సర్పంచు వరప్రసాదరావు, మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు బాలరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.